అధరగొట్టిన కొబ్బరి

- లంకల నుంచి జోరుగా ఎగుమతులు
- రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు
- ఖుషీ అవుతున్న కొబ్బరి రైతులు



బి.దొడ్డవరంలో ఎగుమతి కోసం సిద్ధం చేస్తున్న కొబ్బరికాయలు

మామిడికుదురు: కొబ్బరి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. కనీవినీ ఎరుగని రీతిలో ధరలు పెరగడంతో కొబ్బరి రైతుల్లో దరహాసం వ్యక్తమవుతోంది. వరుస పండుగల నేపథ్యంలో మామిడికుదురు మండల పరిధిలోని లంక గ్రామాల నుంచి జోరుగా కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. దసరా, దీపావళి తదుపరి కార్తీక మాసం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొబ్బరికాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం వెయ్యి కొబ్బరి కాయలు రూ.27 వేలు పైబడి కొంటున్నారు. నెల రోజులు ముక్కుడు కాయలతో పాటు పచ్చి కొబ్బరి కాయలను సైతం ఇదే ధరకు కొంటున్నారు. మండలంలోని పెదపట్నంలంక గ్రామంలో కొబ్బరిలో నాణ్యమైన దిగుబడి ఉంటుందని మొదటి నుంచి నానుడి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామంలో ఇతర గ్రామాల కన్నా రూ.200 ఎక్కువ ధరకు కొబ్బరి రాశులను కొంటున్నారు. నెల రోజుల నుంచి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయని రైతులు చెబుతున్నారు.

కురిడీ కాయలు సైతం..

కురిడీ కాయల ధరలు సైతం పచ్చి కాయల తరహాలోనే ఉన్నాయి. లంక గ్రామాల్లో ప్రస్తుతం కురిడీ కాయలు గండేరా రూ.32 వేలు, గట గటా రూ.30 వేలుకు కొంటున్నారు. పచ్చి కొబ్బరితో పాటు కురిడీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కొంత మంది రైతులు కొబ్బరికాయల ధరలు మరింత పెరుగుతాయన్న నమ్మకంతో రాశులను అమ్మకుండా నిల్వ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరి ధరలు పెరగడంతో రైతులు ఖుషీగా ఉన్నారు. కొబ్బరి తోటలకు వర్షాకాలం సీజన్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. పశువుల పెంటతో పాటు ఇతర ఎరువులను కొబ్బరి తోటలకు పిచికారీ చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



కొబ్బరికాయల ధరలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. రాశులను భారీ ధరకు కొంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంత భారీ ధరకు కొబ్బరికాయలను కొనలేదు. రోజురోజుకు పెరుగుతున్న కొబ్బరి ధరలు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. గతంలో దింపు తీయించేందుకు కూడా సరిపడే సొమ్ములు వచ్చేవి కాదు. కానీ ఆరు, ఏడు నెలల నుంచి మంచి రేటు పలుకుతోంది. ఇదే ధర కొనసాగాలని ప్రతి రైతు కోరుకుంటున్నారు.

– పేరూరి రాంబాబు, రైతు, బి.దొడ్డవరం

పెట్టుబడులకు ప్రోత్సాహం



కొబ్బరి ధరలు పెరగడం చాలా శుభ పరిణామం. ఈ ధరలు కొబ్బరి తోటలకు పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలంగా ఉన్నాయి. ఏడాది క్రితం చాలా మంది కొబ్బరి రైతులకు దయనీయమైన పరిస్థితులు ఉండేది. సరైన పెట్టుబడలు పెట్టలేక తోటలను వదిలేశారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రతి రైతు కొబ్బరి తోటలను చక్కగా చూసుకుంటున్నారు.

– అచంట శ్రీనివాస్, రైతు, అప్పనపల్లి

తక్షణమే పనులు ప్రారంభించండి

సాక్షి కథనంపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధి, మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదేశించారు. నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై 'ఇలా వదిలేస్తే.. వేళ్లేదెలా' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. రాజోలు ఆర్‌అండ్‌బీ డీఈ రవి, ఏఈ రవీంద్రలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అధ్వానంగా ఉన్న బట్టేలంక- శంకరగుప్తం ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.52 లక్షలు, దిండి- రామరాజులంక రోడ్డుకు రూ.1.18 కోట్లు, శివకోడు- మట్టపర్రు రోడ్డుకు రూ.60 కోట్లు మంజూరయ్యాయని డీఈ ఎమ్మెల్యేకు వివరించారు. వీటి పనులు ప్రారంభం అయ్యేలోపు రోడ్లపై తక్షణం పాక్లెయిన్‌తో గోతులు పూడ్చాలని ఆదేశించారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో వివిధ విభాగలపై చర్చించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, జెడ్పీటీసీ ప్రసన్నకుమారి, ఎంపీడీఓ లక్ష్మీ కళ్యాణి, తహసీల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలపై అసంతృప్తి

రాజోలు: గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం రాజోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కడలి శ్రీదుర్గ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పారిశుధ్య చర్యలపై అనేక పర్యాయాలు చెప్పినా కొన్ని పంచాయతీల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని, సంబంధిత విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండట్లేదని సభ్యులు పేర్కొన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ, గ్రామాల్లో ఉన్న సమస్యలపై అధికారులకు ఫోన్ చేసినా సమాధానం ఉండట్లేదని, కనీసం ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: ప్రసిద్ధగాంచిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని ముక్తేశ్వరానికి చెందిన లెక్కింశెట్టి నాగేంద్ర మహేష్ రూ.10,116, వెలపల్లికి చెందిన పాబోలు సూర్యనారాయణ రూ.10,116 బుధవారం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

అధినేతతో ఆత్మీయ భేటీ



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఇంద్రశేఖర్

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ పరిపాలనపై ప్రజలకు వివరించాలని ఆయన సూచించినట్లు శేఖర్ తెలిపారు.

బేతాళ స్వామి మహోత్సవాలకు శ్రీకారం

అంబాజీపేట: దశమి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో ఉన్న శ్రీ విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఆలయం వద్ద అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాట ముహుర్తం చేశారు. ఈ నెల 22న బేతళ స్వామి కలశస్థాపన చేసేందుకు సంఘ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అక్టోబర్ 8న బేతాళ వాహన మహోత్సవం, తీర్థం జరపనున్నట్లు సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, కమిటీ చైర్మన్ సత్య అర్జున మోహన రావు తెలిపారు. కార్యక్రమంలో విత్తనాల ఇంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

మామిడికుదురు: ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ముద్రించకపోవడంపై తాము ఇచ్చిన దరఖాస్తుకు అధికారులు స్పందించారని జిల్లా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. జేసీ నిశాంతిని అమలాపురంలో కలిశామన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులతో దీనిపై చర్చించామని, ప్రతి రేషన్ కార్డు స్కాన్ చేయగా.. ప్రస్తుతం జిల్లా పేరు వస్తోందని చెప్పారన్నారు. త్వరలోనే అన్ని కార్డులపై జిల్లా పేరు ముద్రించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. జేసీకి మొక్కను అందించి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో దళిత నాయకులు నూటికుర్తి సత్యనారాయణ, బొంతు చంద్రశేఖర్, గెడ్డం రమేష్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం



రావులపాలెం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బుధవారం సీహెచ్ సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన మహేశ్వరరావు బదిలీపై వెళ్లడంతో రామచంద్రపురం మండల పరిషత్‌లో ఏవోగా పనిచేస్తున్న సుబ్రమణ్యం పదోన్నతిపై ఎంపీడీవోగా రావులపాలెం వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

ఆలమూరు: జొన్నాడ నుంచి యానాం వెళ్లే ఏటి గట్టు రోడ్డుపై బుధవారం వాహనాల తనిఖీ జరిగింది. ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ ఆదేశాల మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి.నరేష్ నేతృత్వంలో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. స్థానిక ఆలమూరులోని దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలను గుర్తించి రూ.10 వేలు అపరాధ రుసుం విధించారు. యానాం నుంచి అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పత్రి లోగోను ఆవిష్కరించిన జగ్గిరెడ్డి



రికవర్ ఆస్పత్రి పేరు, లోగోను ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: స్థానికంగా నూతనంగా నిర్మించిన రికవర్ ఆస్పత్రి పేరు, లోగోను బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రి ఏర్పాటు చేయడం, ప్రజలకు మంచి వైద్యాన్ని అందించడానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యేవర్మ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వూరి సుధాకరరెడ్డి, పడాల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

పి.గన్నవరం: మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతోపాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, అనగర్లంక, సిర్రావారిలంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద తగ్గుముఖం పట్టింది.

వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి సమష్టి కృషి



జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. మండలంలోని పెనికేరులో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల జయరాజు నేతృత్వంలో స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆయన స్వగృహం గోపాలపురంలో కలిశారు. గ్రామ కమిటీ నియామకానికి కారకులైన జగ్గిరెడ్డికి, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జగ్గిరెడ్డిని సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి కొడమంచిలి హరీష్, సర్పంచ్ వనుం చిన్నావతి, మాజీ అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాసు, మోరంపూడి మధు, గుత్తుల శ్రీనివాసు వనుం జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

చలో మెడికల్ కాలేజీకి తరలిరండి



పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు



మామిడికుదురులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య

పి.గన్నవరం: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 19న అమలాపురం రూరల్ మండలం సమనస మెడికల్ కాలేజ్ వద్ద జరిగే 'చలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, విద్యార్థులు తరలి రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం పోతవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రభుత్వ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేయడాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకట శివరామన్, దూనబోయిన రవిచంద్ర, యాండ్ర నాగేశ్వరరావు, పెచ్చెట్టి రాంబాబు, కుడుపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహిస్తున్న 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, విద్యార్థి ప్రతినిధులు తరలిరావాలని రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య, అధికార ప్రతినిధి తాడి సహదేవ్ పిలుపునిచ్చారు. మామిడికుదురులో బుధవారం జరిగిన రాజోలు నియోజకవర్గ యువజన విభాగం సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సారథ్యంలో 19వ తేదీ ఉదయం మామిడికుదురు నుంచి ప్రదర్శనగా అమలాపురం తరలి వెళ్తామన్నారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణు, కార్యదర్శి కొల్లాబత్తుల మున్న, నియోజకవర్గ విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా, కుసుమ శ్రీధర్, అడబాల జానకీరామ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూపతి మహేంద్ర, నైనాల సత్యమూర్తి పాల్గొన్నారు.

ఏడాదిగా కూటమి అభివృద్ధి ఏదీ?

సమావేశంలో ధ్వజమెత్తిన గన్నవరపు శ్రీనివాసరావు



సమావేశంలో శ్రీనివాసరావుపై విరుచుకుపడుతున్న ఎమ్మెల్యే, ఎఎంసీ చైర్మన్, కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు

అయినవిల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా మండలంలో అభివృద్ధి నామమాత్రమేనని జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఐదేళ్ల అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. దీంతో శ్రీనివాసరావు కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ముక్తేశ్వరం- ముమ్మిడివరం రహదారి అభివృద్ధి ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ప్రముఖ రహదారులను వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా అభివృద్ధి చేశామని తెలిపారు. రైతులకు యూరియా అందివ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇలా పలు విషయాలపై సమాధానం ఇస్తుంటే ఎమ్మెల్యేపాటు, ఎఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, అధికార పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాసరావుపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాణిశ్రీ బెహరా, తహసీల్దార్ విద్యాపతి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్‌కు సత్కారం



రామేశ్వరంలో శివకుమార్‌ను సత్కరిస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్), కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు రామేశ్వరానికి చెందిన పాటి శివకుమార్‌ను బుధవారం పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు సత్కరించారు. ఈ మేరకు శివకుమార్‌ను స్వగృహంలో పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ముమ్మిడివరం సోషల్ మీడియా అధ్యక్షుడు పి.రాజేష్, రాజోలు సోషల్ మీడియా అధ్యక్షుడు జిల్లెళ్ల ఉదయ్ కిరణ్, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి పందిరిపల్లి అమర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఒక్కటైనా కట్టారా?



తాటిపాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

రాజోలు: ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఒక్కటైనా మీరు కట్టారా అని ముఖ్యమంత్రి చంద్రబాబుని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన తాటిపాకలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో బూత్ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. గొల్లపల్లి మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని, వాటిలో ఏడు పూర్తి కాగా, ఐదు కాలేజీల్లో ఏడాది క్రితం నుంచే అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలుసుకోవాలన్నారు. పది కాలేజీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. 14 ఏళ్ల సీఎంగా తన హయాంలో చంద్రబాబు కనీసం ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా నిర్మాణం చేయలేదన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కొత్త ఎత్తు వేస్తున్నారన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు చిత్రపు చెన్నారెడ్డి, నాయకులు మద్దుల కాసు, గుబ్బల మనోహర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రోజారమణి, బొంతు రమేష్, కనపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ



సీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి, సూర్యారావు

రావులపాలెం: అనారోగ్యంతో ఇటీవల మరణించిన రావులపాలెనికి చెందిన పాస్టర్ కప్పల వరప్రసాద్ కుటుంబసభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. ఈ సందర్భంగా సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్ సబ్బితి మోహనరావు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కర్రి అశోక్‌రెడ్డి, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి, కోరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని నిరసన

సఖినేటిపల్లి: ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్లకార్డులతో విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలనే నమ్ముకున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రధానంగా వేతనాలు పెంపు, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు, హెచ్‌ఆర్ పాలసీ అమలు వంటి వాటిపై తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అక్టోబర్ 12న విజయవాడలో దశాబ్ద ఐక్యత భవిష్యత్ పోరాట నిరసన సభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

అయినవిల్లి: మండలంలోని జోగివారిపాలెం శివారు గౌతమి నగర్‌లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన బాధితులకు అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సాయం అందించారు. అగ్ని ప్రమాద బాధితులు ఇసుపట్ల నాగ వెంకటరమణ కుటుంబానికి లయన్స్ క్లబ్ తరపున 26 కేజీల బియ్యం, కిరాణా సామాగ్రి, కూరగాయలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సూదా గణపతి, కార్యదర్శి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పరిశ్రమలతో మహిళల ఆర్థిక పురోభివృద్ధి

అంబాజీపేట: చిన్న తరహా పరిశ్రమలను మహిళలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఆర్థిక పురోభివృద్ధి చెందవచ్చని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా డ్వామా పీడీ జయచంద్ర గాంధీ అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి డ్వాక్రా మహిళలకు, చిన్నతరహా వ్యాపారస్తులకు ప్రభుత్వ రాయితీలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలకు రాయితీలతో కూడిన రుణాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ డైరెక్టర్ ఎస్.అరుణ మాట్లాడుతూ, వ్యాపార సంస్థలను నెలకొల్పే ముందు ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సిద్ధవి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వైస్‌చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం ఏపీఎంలు వెంకటేశ్వరరావు, దుర్గా నాగవేణి, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కళాకృతులు విశ్వకర్మ ప్రతిభకు నిదర్శనం

మామిడికుదురు: అద్భుతమైన మహా శిల్ప కళాకృతులు విశ్వకర్మ ప్రతిభకు నిదర్శనమని ఎంపీడీఓ భవానీ తెలిపారు. విశ్వకర్మ జయంతిని మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్రంగిగా విశ్వకర్మ ఎన్నో అద్భుతమైన కట్టడాలను నిర్మించారని కీర్తించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు సత్కారం

మామిడికుదురు: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బుధవారం మగటపల్లి శివాలయం ప్రాంగణాన్ని ఆ పార్టీ నేతలు శుభ్రం చేశారు. ఆలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. విశ్వకర్మ జయంతిలో భాగంగా చేతి వృత్తిదారులైన దెందులూరి సూర్యనారాయణమూర్తి దంపతులను సత్కరించారు. మొగలికుదురు భరోసా కేంద్రంలో అనాథలు, పిల్లలు, వృద్ధులకు బ్రెడ్, పాలు, పండ్లు అందించారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు

రాజోలు: స్కూల్ గేమ్స్ మండల స్థాయి బాలికల పోటీల్లో పలువురు విద్యార్థినులు ప్రతిభ చూపి డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బుధవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.సరస్వతి పోటీలకు ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన షాట్‌పుట్ పోటీల్లో టి.తనూజ (చింతలపల్లి), ఎ.సౌమ్య(కాట్రేనిపాడు), జి.జ్యోత్స్న (కూనవరం), ఆర్.సుదీక్ష, కె.సిరి, పి.స్పందన (గురుకుల) అండర్-17 విభాగంలో లాంగ్ జంప్ పోటీల్లో డి.అక్షయశ్రీ (రాజోలు), ఆర్.సుదీక్ష(కూనవరం), ఎస్.సహస్ర దేవి(గురుకుల), హైజంప్ పోటీల్లో డి.అక్షయశ్రీ(రాజోలు), బి.దివ్య(గురుకుల), ఎ.మధుమతి(రాజోలు)లు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. వాలీబాల్ పోటీల్లో కూనవరం, కబడ్డీ పోటీల్లో రాజోలు, కడలి, ఖోఖో పోటీల్లో కూనవరం జట్లు విజేతలుగా నిలిచాయి.

గోశాలకు పశుగ్రాసం వితరణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరుకు చెందిన రైతులు బుధవారం ట్రాక్టర్ పశుగ్రాసం అందించారు. పశుగ్రాసం అందించిన రైతులకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ సత్యనారాయణరాజు రైతులను అభినందించారు.

ఆలయ ఉద్యోగుల సంతాపం

అనారోగ్యంతో మృతి చెందిన మాజీ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ మృతికి ఆలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు. రామకృష్ణ మృతికి సంతాపంగా ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు మౌనం పాటించారు. చైర్మన్‌గా రామకృష్ణ ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని ఈఓ సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

రావులపాలెం: ఉపాధ్యాయులకు విద్యార్థులకు పాఠాలు చెప్పే వాతావరణం కల్పించాలని అధికారులను కోరుతున్నట్టు ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు శేఖర్ అన్నారు. ఎస్టీయూ సభ్యత్వం నమోదు ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని హైస్కూల్‌ల్లో ఎస్టీయూ సభ్యులు పర్యటించారు. దేవరపల్లి హైస్కూల్‌లో శేఖర్ మాట్లాడుతూ, అనేక రకాల విద్యేతర కార్యక్రమలతో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితులు లేవన్నారు. దయచేసి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలో చదవే పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్ కోసం హ్యాండ్ బుక్, వివిధ రకాల యాప్‌లు, విద్యా శక్తి, స్వచ్ఛ పక్వాడ్ వంటి కార్యక్రమాల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులను తప్పించి బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు.

నిత్య విద్యార్థిగా 'సత్యనారాయణ' ఆదర్శం

రాజోలు: నిత్య విద్యార్థిగా తాడి సత్యనారాయణ మూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ సూర్యనారాయణరాజు అన్నారు. బుధవారం పొన్నమండ ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు తాడి సత్యనారాయణమూర్తి పదవీ విరమణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ తదితరులు ఆయనను సత్కరించారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఏడుకు పైగా డిగ్రీలు పూర్తి చేయడంతోపాటు అనేక అంశాలపై పరిశోధనలు చేశారని పలువురు కొనియాడారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, విద్యా కమిటీ చైర్మన్ పితాని వెంకటప్రసాద్, ఫీల్డ్ లేబర్ సొసైటీ చైర్మన్ కుసుమ రాజ్‌కుమార్, ఎంఈఓ ప్రసాదరావు, హెచ్‌ఎం రోహిణి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో వివిధ సబ్‌స్టేషన్‌ల మధ్య అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం రూ.84 లక్షలతో కవర్డ్ కండక్టర్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు మలికిపురం విద్యుత్ శాఖ ఏఈ బొలిశెట్టి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, రాజోలు ఎమ్మెల్యే కృషితో ఈ లైన్ మంజూరైనట్లు చెప్పారు. రాజోలు నుంచి లక్కవరం- మలికిపురం- గొల్లపాలెం మధ్య సబ్‌స్టేషన్లకు ఈ కవర్డ్ కండక్టర్ లైన్ ఉంటుందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు.